## ప్రజలకు వేగవంతమైన వైద్య సేవలే లక్ష్యం

- 108 సేవల పనితీరుపై అధికారుల పరిశీలన
- ప్రజా ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి
- అత్యవసర సేవల్లో లోపాలు ఉండకూడదని అధికారుల సూచనలు

2




నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
బుధవారం 25, మార్చి 2026 పేజీలు:4


# త్వరలో పాలకుర్తికి వస్తా: సీఎం



- పాలకుర్తి ప్రగతిపై ప్రత్యేక నజర్
- ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ ఇన్‌ఛార్జి ఝాన్సీరెడ్డి కీలక భేటీ
- నియోజకవర్గ అభివృద్ధికి నిధుల వరద కురిపించాలని విన్నపం
- సీఎం రేవంత్‌రెడ్డి సానుకూల స్పందన

హైదరాబాద్ బ్యూరో, (నేటి ఫోకస్ న్యూస్)- మార్చి 24:

పాలకుర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మంగళవారం హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గం లోని పలు కీలక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు పాలకుర్తిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రత్యేక నిధుల మంజూరుపై సీఎంకు వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగు ణంగా మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడబోమని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.






# అసెంబ్లీ ముట్టడి విజయవంతం

**వడ్డెర సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి మల్లీశ్వరి**

కల్వకుర్తి, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 24:

రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు హామీని నిలబెట్టుకోకపోవడంతో తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం విజయవంతం అయిందని వడ్డెర సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి మల్లీశ్వరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డెర హక్కుల సాధనకు కృషి చేస్తున్న మమ్మల్ని అరెస్టు చేయడం దారుణమని అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్న వడ్డెర సంఘం నాయకులను అరెస్టు చేసి బేగంపేట్ పోలీస్ స్టేషన్ కు తరలించారన్నారు. హక్కుల సాధన కోసం పోరాడుతుంటే అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని ఆమె విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సాధారణ ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు దేవరాజు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పద్మ రాష్ట్ర కార్యదర్శి విజయ రాష్ట్ర మహిళా కార్యదర్శి మల్లీశ్వరి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు తిరుపతయ్య రాష్ట్ర కోశాధికారి గుర్రం శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహిళలు పద్మ, వివిధ జిల్లాల నుంచి వచ్చిన వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు సరికొత్త విజన్..

## సీఎం రేవంత్ కీలక ప్రకటన...

హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్

హైదరాబాద్ నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, నివాసయోగ్యంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' అనే బృహత్ ప్రణాళికతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనమండలిలో సుదీర్ఘంగా ప్రసంగించిన ఆయన, నగరాభివృద్ధిపై ప్రభుత్వ దార్శనికతను, చేపట్టబోయే ప్రాజెక్టులను వివరించారు. దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు కాలుష్యం, వరదలు, ట్రాఫిక్ వంటి తీవ్ర సమస్యలతో సతమతమవుతున్నాయని, అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూస్తామని ఆయన అన్నారు.



తెలంగాణను క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ), ప్యూర్ (మాన్యుఫ్యాక్చరింగ్ హబ్), రేర్ (అగ్రికల్చర్) అనే మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు సీఎం తెలిపారు. ఇందులో భాగంగా, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను బయటకు తరలించి, ఆ భూములను మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. దీనివల్ల నగరం మరింత నివాసయోగ్యంగా మారుతుందని వివరించారు. హైదరాబాద్‌ను రోడ్లు, రైల్వే, ఎయిర్‌పోర్టులతో అనుసంధానించే రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, సికింద్రాబాద్, చర్లపల్లి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసుకున్నామని గుర్తుచేశారు.

నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. రోడ్లను అండర్‌పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా బేగంపేట ఎయిర్‌పోర్టు రన్‌వే కింద అండర్‌పాస్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు సాధించామన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని, లాస్ట్ మైల్ కనెక్టివిటీ సమస్యను అధిగమించేందుకు విస్తరించనున్నట్లు ప్రకటించారు. మెట్రో విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా ఉందని చెప్పారు.

మూసీ నది ప్రక్షాళన, అభివృద్ధిపై సీఎం కీలక ప్రకటన చేశారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు మూసీ వెంట ఎలివేటెడ్ కారిడార్ నిర్మించడం ద్వారా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు రాజకీయం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించి వదిలేసిన పనులను తాము ముందుకు తీసుకెళుతుంటే అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. అభివృద్ధిని అడ్డుకోవద్దని, నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని కోరారు. సూచనల కోసం అవసరమైతే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీని వేస్తామని ప్రతిపాదించారు.

ఈ సందర్భంగా మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు సీఎం భరోసా ఇచ్చారు. అభివృద్ధి పనుల వల్ల ఏ ఒక్కరినీ నిరాశ్రయులను చేయబోమని, మెరుగైన వసతులతో పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం తరఫున హామీ ఇచ్చారు. రాజకీయ పార్టీల ఉచ్చులో పడకుండా, అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించి, చిరు వ్యాపారులకు ప్రత్యేక స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. సుపరిపాలనతో పాటు స్మార్ట్ గవర్నెన్స్‌పై దృష్టి సారించి, హైదరాబాద్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.



# మహిళలు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు మార్చి 24

మహిళలు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ తూనమ్ శ్రావణ్ కుమార్ తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో ఎన్ ఎస్ సి స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించారు. టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్, శారీ పెయింటింగ్స్ క్రాఫ్ట్ డిజైన్, అల్లికలు, క్లాసికల్ డాన్స్ తదితర అంశాలపై శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహిళలు నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. మహిళలు పలు రకాల శిక్షణలు పొందడం ద్వారా కుటుంబానికి ఆసరాగా నిలుస్తారని పేర్కొన్నారు. మహిళల ద్వారానే సమాజ పురోగతి సాధ్యమని, ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్సీ ప్రతినిధి డాక్టర్ శాంతి, అర్చకులు సంతోష్, లిటిల్ ఫ్లవర్ ప్రిన్సిపాల్ కోట నాగేశ్వర్, మహిళలు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

**అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు -- ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం కానున్న కమిటీ.**

హైదరాబాద్, మార్చి 24:

హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో ఈ రోజు రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఏసీ -- స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార--పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కో-చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు.

జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు.

అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు.

సమాచార--పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రజలకు వేగవంతమైన వైద్య సేవలే లక్ష్యం





**- 108 సేవల పనితీరుపై అధికారుల పరిశీలన**

**ప్రజా ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి**

**అత్యవసర సేవల్లో లోపాలు ఉండకూడదని అధికారుల సూచనలు**

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు మార్చి 24

అత్యవసర వైద్య సేవలలో కీలక పాత్ర పోషించే 108 అంబులెన్స్ సేవల పనితీరును పరిశీలించేందుకు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సేవల నాణ్యత, పరికరాల సిద్ధతపై ప్రత్యేక దృష్టి సారించారు.

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలో మంగళవారం 108 అంబులెన్స్‌పై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మూడు జిల్లాలు --- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ క్లస్టర్ ఇన్‌చార్జి పీఎం షేక్ నసీరుద్దీన్, మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఈఎంఈ బత్తిని మహేష్ ఈ తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా అంబులెన్స్ సిబ్బంది పనివిధానం, వాహనం పనితీరు, నిర్వహణ రికార్డులను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే పరికరాల పనితీరును సైతం పరీక్షించి, అవి సక్రమంగా పనిచేస్తున్నాయా అనే విషయాన్ని తెలుసుకున్నారు. సేవలలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రజలకు తక్షణ వైద్య సహాయం అందేలా ఉండాలని అధికారులు సూచించారు.

ఈ తనిఖీలో 108 అంబులెన్స్ సిబ్బంది గంజి నవీన్ రెడ్డి, బానోత్ వనజ పాల్గొన్నారు.

# తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం హర్షనీయం

**టి.పి.సి.సి లీగల్ సెల్ రాష్ట్ర అధికారప్రతినిధి ప్రశాంత్**

కల్వకుర్తి, నేటి ఫోకస్ న్యూస్ మార్చి 24:



తెలంగాణలోని న్యాయవాదుల చిరకాల వాంఛ అయిన న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం పొందడంతో టి.పి.సి.సి లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రశాంత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై జరుగుతున్న దాడులు , హత్యాలను కట్టడి చేయడం తో పాటు, వారికి రక్షణ, భద్రత కల్పించేందుకు ఈ బిల్లును రూపొందించారన్నారు. గతంలో జరిగిన అడ్వకేట్ ల హత్యలు, దాడుల నేపథ్యంలో న్యాయవాదులకు తగిన భద్రత కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఈ బిల్లును ఆమోదింప చేసే లక్ష్యంతో ప్రజజ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి పలుమార్లు ప్రతిపాదనలు అందజేయడంతో పాటు అలంపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అలంపూర్ నుండి రాష్ట్ర సచివాలయం వరకు న్యాయవాదులందరూ పాదయాత్ర చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా న్యాయవాదుల ప్రతిపాదనలు పరిగణ లోకి తీసుకొని న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్టు బిల్లును క్యాబినెట్ ఆమోదించడం హర్షనీయమన్నారు న్యాయవాయుల భద్రత, గౌరవాన్ని కాపాడే దిశగా ఈ చట్టం మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బిల్లుకు ఆమోదం పొందడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు రాష్ట్ర క్యాబినెట్ మంత్రులకు టీ.పి.పి.సి రాష్ట్ర లీగల్ సెల్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.